క్లుప్తంగా

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



వైఎస్సార్ బీమా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న వైసీపీ నాయకులు

ఉంగుటూరు: నారాయణపురం గ్రామంలో వైఎస్సార్ బీమాలో మంజూరైన లక్షరూపాయల చెక్కును ఆగ్రామ వైసీపీ నాయకులు బాధిత కుటుంబాలకు అందజేశారు. భీమడోలు ఏసురత్నం చనిపోవడంతో అతని భార్య లక్ష్మికి, షేక్ మస్తాన్ చనిపోవడంతో అతని భార్యకు ఈ చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బండారు నాగరాజు, వైసీపీ నాయకుడు అరివెల్లి ధానయ్య, గ్రామ వైసీపీ కన్వీనర్లు మతుకుమిల్లి శ్రీధర్, ఆర్మీబాలు, కొడమంచిలి మూర్తిరాజు, గ్రామ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: గాలాయగూడెంలో అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి 66వ వార్షికోత్సవ వేడుకలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు 9 రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. చివరి రోజున మధ్యాహ్నం 2 గంటలకు వేలాది మంది భక్తుల సమక్షంలో అగ్ని గుండ ప్రవేశం, 10వ రోజు అమ్మవారి ఆలయ ఆవరణలో వేలాది మంది భక్తులకు మహా అన్నసమారాధన నిర్వహించనున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



చిన్న వెల్లమిల్లిలో ప్రజలను చైతన్య పరుస్తున్న వైద్య సిబ్బంది

ఉంగుటూరు: ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా యూనిట్ పర్యవేక్షకులు వై.వి.లక్ష్మణరావు తెలిపారు. చిన్నవెల్లమిల్లి, చింతాయిగూడెంలో పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆరోగ్య కార్యదర్శులు విజయకుమారి, ఆరోగ్య సహాయకులు కాంతారావు, ఆశావర్కర్లు లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త ఇందిరా దేవి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు అప్పనవీడులో 'గడపగడపకు'

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో బుధవారం 3 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పెదపాడు ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి తెలిపారు. ఈకార్యక్రమంలో దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు.

నిడమర్రులో..

నిడమర్రు: మండలపర్రు గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మూడవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. రూ40 లక్షలతో నిర్మించిన మండలపర్రు గ్రామ సచివాలయం నూతన భవనాన్ని బుధవారం ఉదయం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంకు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై గత మూడేళ్లలో ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకూ అధికారులు హాజరుకావాలన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



కోడిపందేలు ఆడే ప్రాంతాల్లో సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్

ఉంగుటూరు: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఉంగుటూరు, చేబ్రోలు గ్రామాల్లో కోడి పందేలు, జూదాలు వల్ల కలిగే అనర్ధాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ సంక్రాంతి వేళ సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, మ్యూజికల్ చైర్స్, హాకీ వంటి క్రీడలతో ఆనందంగా గడపాలన్నారు. కోడి పందేలు, గుండాట, కోశాట, పేకాట తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జోలికి వెళ్లి కఠినమైన చట్టాల్లో ఇరుక్కుని జీవితాలను చేజేతులా నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

యువత సంప్రదాయ క్రీడల్లో భాగస్వాములు కావాలి



గణపవరంలో సంప్రదాయ క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు



భీమడోలులో సీఐ వి.వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న వైసీపీ నేతలు, డైమండ్స్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గణపవరం: సంక్రాంతి పేరుతో కోడిపందేలు, జూదం వంటి చెడు వ్యసనాల జోలికి పోకుండా ప్రజలు సంప్రదాయ క్రీడల్లో భాగస్వాములు కావాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు –2023లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించే సంప్రదాయ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ సంక్రాంతి పేరుతో కోడి పందేలు, పేకాట, కోతాటలను ప్రభుత్వం నిషేధించిందని, ఇటువంటివి జరుగకుండా పోలీసుశాఖ గట్టి ఏర్పాట్లు చేసిందని, అందువల్ల ప్రజలు వీటికి దూరంగా ఉండాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్నిచ్చే సంప్రదాయ క్రీడలు జరుపుకోవాలన్నారు.గణపవరం సీఐ ఎంవి సుభాష్ మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు లోనుకాకుండా పండుగ రోజుల్లో సంప్రదాయ ఆటలపోటీలు, రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తొలిరోజు రంగోలి పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో మొదటి బహుమతి బి.బేబిచాందిని, రెండవ బహుమతి కె.పల్లవి, మూడో బహుమతి సీహెచ్ సునీతరాణి గెలుచుకున్నారు. విజేతలకు ఎమ్మెల్యే వాసుబాబు బహుమతులు ప్రసంసా పత్రాలను అందచేశారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10వేలు అందచేస్తామని సిఐ సుభాష్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గణపవరం, నిడమర్రు ఎస్సైలు వి.వెంకటేశ్వరరావు,గుర్రయ్య, డిగ్రీకాలేజి ప్రిన్సిపల్ నిర్మలకుమారి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, వెజ్జువెంకటేశ్వరవు, గాదిరాజు అబ్బాస్, డేగల కొండయ్య, బుంగా సంజీవ్, చింతలపాటి కాశీరాజు పాల్గొన్నారు.

జూదక్రీడలతో భవిష్యత్తు నాశనం

భీమడోలు: సంక్రాంతి రోజున జూదక్రీడల ఉచ్చులో పడి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని భీమడోలు సీఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. భీమడోలు సత్యేంద్ర పాఠశాల ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంప్రదాయక సంక్రాంతి సంబరాలు ముద్దు... జూదక్రీడలు వద్దు అనే నినాదంతో రెండు రోజులు పాటు నిర్వహించనున్న షటిల్ టోర్నమెంట్‌ను మంగళవారం రాత్రి సీఐ వి.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎంపీపీ కనమాల రామయ్య, ఏఎంసీ చైర్మన్ ఇంజేటీ నీలిమజూనియర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సీఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని నింపుతాయన్నారు. సంక్రాంతి పండుగ ముసుగులో కోడి పందేలు, గుండాట, పేకాట, కోసాట తదితర జూదక్రీడల ఉచ్చులో పడి చాలా మంది ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలను సాగిస్తే పోలీస్ సిబ్బంది దృష్టికి తీసుకువచ్చి సహకరించాలన్నారు. సంప్రదాయకబద్ధంగా సంక్రాంతిని జరుపుకుంటే గ్రామాల్లో ప్రశాంత వాతావరణ నెలకొంటుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని చాటారు. తొలుత సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్సై చావా సురేష్‌కుమార్, పోలీస్ సిబ్బంది షటిల్ ఆడి యువకులను ఉత్సాహపర్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మద్దుల రాజా, నియోజకవర్గ జగన్‌సేవాదళ్ కన్వీనర్ తుమ్మగుంట రంగ, రాష్ట్రకార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, డైమండ్స్ లైయన్స్ క్లబ్ కోశాధికారి సత్యేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము సునీతామాన్‌సింగ్, ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు, పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

జూద క్రీడలు వద్దు.. సంప్రదాయ ఆటలే ముద్దు

పెదవేగి : జూద క్రీడలు వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు అని నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు ఎస్పీ రాహుల్ దేవ్ శర్మ ఐపీఎస్ ఆదేశాలపై నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ పెదవేగి సీఐ దుర్గప్రసాద్, పెదవేగి ఎస్సై లక్ష్మణ పెదవేగిలో పోలీస్ సంక్రాంతి సంబరాల్లో భాగంగా మంగళవారం క్రీడా పోటీలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ పోటీల్లో విజేతలకు పోలీసుల ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామని నూజివీడు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ తెలియజేసినారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- మండలపర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వాసుబాబును సత్కరిస్తున్న వైసీపీ నాయకులు

నిడమర్రు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతల తీసుకున్న నాటి నుంచి రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం మండలపర్రు గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. నేటితో నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం 115వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంకు హాజరైన ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా పేదరికమే ప్రమాణికంగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. పేద ప్రజల జీవితాల్లో మరిన్న మార్పులు తీసుకు వచ్చేందుకే అన్ని వర్గాలకు పథకాల్లో సముచిత స్థానం కల్పించారన్నారు. సుమారు 120 గడపల వరకూ వెళ్లి కరపత్రాలు అందించి వారు ప్రభుత్వం తరుపున పొందుతున్న ఆర్థిక సహకారం, సేవలను ఎమ్మెల్యే వాసుబాబు వివరించారు. వైసీపీ కేంద్రక మిటి సభ్యులు గాదిరాజు వెంకట సుబ్బరాజు మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, మాజీ సర్పంచ్ గాదిరాజు సుదర్శన వర్మ, సర్పంచ్ దెందుకూరి సూర్యాకాంతం త్రిమూర్తిరాజు, ఎంపీటీసీ ముదునూరి త్రివేణి, గ్రామపార్టీ అధ్యక్షులు బత్రాజు ప్రసాదు, ముదునూరి రాము, ఇందుకూరి సూర్యనారాయణరాజు, దెందుకూరి సుబ్బరాజు, దావీదు, సాల్మన్, సులేమాన్, తుమ్మూరి సుబ్బయ్య తదితరులున్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



గుండుగొలను ఉన్నత పాఠశాలకు హెచ్ఎంకు ఫర్నిచర్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

భీమడోలు: పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. అలాగే క్రమశిక్షణ, సేవాభావంను విద్యార్థి దశ నుంచి అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలిపారు. గుండుగొలను మావులేటి సోమరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984–89లో చదువుకున్న 120 మంది పూర్వ విద్యార్థులు అందించిన లక్ష రూపాయల ఆర్థిక సాయంతో మంగళవారం పాఠశాలలో ఇనుప కుర్చీలు, రివాల్వింగ్ చైర్స్ తదితర ఫర్నిచర్‌ను పాఠశాల హెచ్ఎం గారపాటి కనకదుర్గా సునీతకు అందజేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చూపే కృషి అభినందనీయమన్నారు. అనంతరం హెచ్ఎం సునీతా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవడం చాలా సంతోషమన్నారు. పాఠశాలకు ఫర్నిచర్‌ను అందించిన బ్యాచ్ విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం హెచ్ఎం, ఉపాధ్యాయులను దుశ్శాలువాలను కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు తోట శామ్యూల్, కె.భీమేశ్వరరావు, బి. వెంకట రామ్మోహనరావు, ఎస్ఆర్ఐ చేబత్తిన ఏసుదాస్, పూర్వ విద్యార్థులు తలారి వేణుగోపాలకృష్ణ, కర్రి గంగాధరరావు, పట్నాల వెంకటేష్, బ్రవర పరమేశ్వరరావు, కె.లక్ష్మీ, ఏ.ఝాన్సీరాణి, ఎం.దుర్గాప్రసాద్, సీహెచ్ శివ నాగేశ్వరరావు, పూడి వీవీఎస్ రంగ, పూర్వ విద్యార్థులు టి.సుమన్‌బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతిపత్రం

ఉంగుటూరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉంగుటూరు తహసీల్దార్ బి.సుమతికి అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల సహాయ కార్యదర్శి వై. సుజాత మాట్లాడుతూ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలన్నారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సీనియారిటీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టుల్లో వయో పరిమితి తొలగించాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయో పరిమితి 50 సంవత్సరాలకు పెంచాలని తదితర డిమాండ్‌లతో వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సిహెచ్ రత్న కుమారి, కనక మహలక్ష్మి, ఎం . కరుణమ్మ ,కె. భారతి, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమడోలు తహసీల్దార్ ఘంఘాద్దీన్‌కు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు వినతిపత్రం సమర్పించారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండల సీఐటీయూ అధ్యక్షురాలు జి.స్వర్ణ కుమారి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చేపల చెరువుల తవ్వకాలకు అనుమతుల్లేవు



సర్వేలో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి కె.మంగారావు

భీమడోలు: కొత్తగా చేపల చెర్వులను తవ్వకునేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం లేదని భీమడోలు మండల ఇన్‌చార్జి మత్స్యశాఖాధికారి కె.మంగారావు అన్నారు. మండలంలోని భీమడోలు, ఆగడాలలంకలో మంగళవారం ఆక్వా జోన్ రీసర్వేపై గ్రామ సభలు నిర్వహించారు. భీమడోలు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగారావు మాట్లాడుతూ నాన్ ఆక్వాజోన్ పరిధిలోని చేపల చెర్వుల సర్వే నంబర్లు, విస్తీర్ణం తెలుసుకుని వాటిని ఆక్వా జోన్‌లోకి తీసుకుని వచ్చేందుకు ప్రభుత్వం ఈ గ్రామ సభలను ఏర్పాటు చేసిందన్నారు. ఆక్వా జోన్‌లోకి వచ్చే చేపల చెర్వులకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. దీనితో ఆక్వా రైతులకు ఎంతగానో మేలు చేకూరుతుందన్నారు. మండలంలో భీమడోలు, గుండుగొలను, ఆగడాలలంక, కురెళ్ల గూడెం, ఎంఎంపురం, సాయన్నపాలెం, చెట్టున్నపాడు, మల్లవరం, కోరుకల్లు రెవెన్యూ ఆయకట్టుల్లో చేపల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉందన్నారు. దీనితో ఆ ప్రాంతాలు ఆక్వాజోన్‌ల పరిధిలోకి వస్తున్నాయన్నారు. మరికొన్ని ప్రాంతాల్లో చేపల చెర్వులు ఉన్నప్పటికీ వాటిని ఆక్వాజోన్ పరిధిలోకి రాకపోకవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారని గుర్తించిన ప్రభుత్వం నాన్ ఆక్వా జోన్‌లోని సర్వే నంబర్లు, విస్తీర్ణాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా సభలను నిర్వహిస్తోందన్నారు. దీనిపై నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. ప్రస్తుతంగా కొత్తగా చేపల చెర్వులను తవ్వకునేందుకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. భీమడోలులో 2వేల విస్తీర్ణం ఉండగా సుమారు 1,200 ఎకరాల్లో ఆక్వా చేపల చెర్వులను విస్తరించాయన్నారు. రీ సర్వే తర్వాత కొత్తగా చెర్వులు తవ్వకునేందుకు అనుమతుల మంజూరు విషయంలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ భలే రాంబాబు, చేనేత విభాగం వైసీపీ జిల్లా అధ్యక్షుడు గోలి సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు సైదు గోపాలకృష్ణ, కార్యనిర్వాహణాధికారులు ఎస్.ఠాగూర్, మురళీలు, మత్స్యశాఖ సహాయ సహాయకులు వాసు, ఎస్‌కే రఫీ, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలుకు నిధులివ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఏలూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్.సుధీర్, జెడ్పీటీసీ లీలానవకాంతం

దెందులూరు: ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయాలని ప్రజాప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరిని కోరారు. ఏలూరులో ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మించదలిచామని, ఈ నేపథ్యంలో తమ వంతు సహకారంగా రూ.10 లక్షలు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి పూర్తి సహాయసహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. వినతిపత్రం అందించిన వారిలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పోతునూరు సర్పంచ్ బోదుల స్వరూప్, కొవ్వలి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కాటి సుధాకర్, మండల వైఎస్సార్‌సీపీ నేత నిట్టా గంగరాజు ఉన్నారు.

నేటి నుంచి వాలీబాల్ పోటీలు

ఉంగుటూరు: ఈనెల 11, 12 తేదీల్లో నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రౌండులో పోలీసు ఉన్నతాధికార్లు సూచనలు మేరకు వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై కె.స్వామి తెలిపారు. యువత కోడిపందేలు, జూదం వైపు యువత వెళ్లకుండా ఉండేలా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమతాగేమ్స్ అండ్ స్పోర్ట్సు సహకారంతో ఈపోటీలు నిర్వహిస్తామన్నారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు సమతాగేమ్స్ ప్రెసిడెంటు పాతూరి శ్రీనివాసరాజు, కార్యదర్శి రుద్రరాజు గనపతివర్మ బహుమతులు అందజేస్తారని తెలిపారు. 11వ తేదీ మధ్యాహ్నం ఈపోటీలను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారని చెప్పారు.

నేడు సంక్రాంతి క్రీడలు

పెదపాడు: యువత కోడిపందేలు పేకాట, గుండాటలకు దూరంగా ఉండాలని పెదపాడు ఎస్సై బీ నాగబాబు సూచించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఆటల పోటీలవైపు ప్రజలు మొగ్గు చూపాలన్నారు. పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందిస్తామని చెప్పారు.

అర్హతే ప్రామాణికంగా పథకాల వర్తింపు



మాదేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: పార్టీ, వర్గ భేదాలు లేకుండా అర్హతున్న ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తోన్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన ఏలూరు మండలం మాదేపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేసి అర్హులను గుర్తించి పథకాల లబ్ధి అందించాలన్నారు. ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి వారికి అందుతున్న పథకాల లబ్ధిని వివరించారు. పలువురు గ్రామస్తులు స్థానిక సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. వీటి పరిష్కారానికి అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, సర్పంచ్ కొరపాటి ప్రభుదేవ్, పార్టీ నాయకులు పీవీరావు, తేరా ఆనంద్, మండల కొండలరావు, పల్లెం ప్రసాద్, నరహరిశెట్టి రాధాకృష్ణ, బొల్లిముంత రామ్మోహనరావు, గుర్రం శివ తదితరులు పాల్గొన్నారు.

దేవునిపై విశ్వాసం కలిగి ఉండాలి



సభలో మాట్లాడుతున్న మండలి చైర్మన్ మోషేన్‌రాజు వేదికపై ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: దేవునిపై విశ్వాసం, నమ్మకం కలిగి ఉంటే దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉంటాయని శాసనమండల చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. మంగళవారం గణపవరం వైఎస్సార్ కాలనీలో క్రీస్తుఆరాధన ప్రార్థన గుడారము 13వ వారికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన సభకు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అధ్యక్షత వహించారు. సభలో మోషేన్‌రాజు మాట్లాడుతూ దేవుడిని ఆరాధిస్తూ భయభక్తులు కలిగి ఉండాలన్నారు. అప్పుడే దేవుని దీవెనలు అందుతాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు క్రీస్తుని ఆరాధిస్తున్నారని, వారంతా దేవుని సందేశాన్ని పాటిస్తూ సాటి మానవులపై ప్రేమ, దయాగుణం కలిగి ఉండాలని సూచించారు. రాష్ట్రంలో క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ఎప్పుడూ లేనివిధంగా పాస్టర్లకు నెలకు రూ.5వేల గౌరవవేతనం అమలు చేస్తున్నామని అన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరిస్తే సమాజంలో శాంతి సౌభాగ్యాలు నెలకొంటాయన్నారు. ప్రజల రక్షణ కోసం క్రీస్తు తన రక్తాన్ని చిందించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రక్రీస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్, గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, సర్పంచ్ మూర అలంకారం, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దండు రాము, పుప్పాల చినబాబు, సొసైటీ అధ్యక్షుడు కొనిశెట్టి రమేష్, చర్చిఫాదర్ ఎ.రమేష్, వ్యవసాయసలహా సంఘం జిల్లా చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు పార్టీ నాయకులు కాకర్ల శ్రీను, నడింపల్లి సోమరాజు, రొంగల శ్రీను, తోట శ్రీను, కొండేటి వెంకటరత్నం, తెనాలి సునీల్, దేవారపు బాబులు, శెట్టి రాజా తదితరులు పాల్గొన్నారు.